సాక్షి విశాఖపట్నం
గురువారం । 6 । జూన్ । 2024



నీట్‌లో గిరి విద్యార్థుల సత్తా
నీట్ ఫలితాల్లో మారికవలసలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థులు ప్రతిభ చూపారు. 8లో



దారిదోపిడీ ఆగేదెప్పుడు?
అగనంపూడి వద్ద నిబంధనలకు విరుద్ధంగా 25 ఏళ్లుగా టోల్ గేటు కొనసాగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 12లో



పెదగాడిలో జనసైనికుల వీరంగం 12లో

న్యూస్‌రీల్

విద్యాకానుక కిట్ల పరిశీలన


కిట్లను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖ విద్య: విద్యార్థులకు అందజేసే విద్యాకానుక కిట్లను విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ బుధవారం పరిశీలించారు. పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలలకు సరఫరా చేసే నిమిత్తం నిల్వ చేసిన విద్యా కానుక కిట్లను పరిశీలించారు. విద్యార్థులకు చేరే వరకు కానుకలోని ప్రతీ వస్తువు కూడా భద్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత స్టాక్ పాయింట్ నిర్వాహకులదేనన్నారు. స్టాక్ పాయింట్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో కె.సువర్ణ పాల్గొన్నారు.

ఈఎన్‌టీలో వీడియో ఎండోస్కోపీ ప్రారంభం


ఎండోస్కోపీని ప్రారంభిస్తున్న బుచ్చిరాజు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన వీడియో ఎండోస్కోపీ యూనిట్, ఆధునికీకరించిన ఓపీడీ, వైద్యుల చాంబర్లను బుధవారం ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. ఎండోస్కోపీ యూనిట్‌ను మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి బహూకరించిన సంగతి తెలిసిందే. ఓపీడీలో పీజీ, యూజీ విద్యార్థులకు ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ అందించడానికి వీడియో ఎండోస్కోపీ ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు.

విమ్స్ సీఎంవోగా డాక్టర్ అరుణదేవి

అరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్) క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్(సీఎంవో)గా డాక్టర్ అరుణదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కేజీహెచ్ ట్రామాకేర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఇటీవల విమ్స్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

ఆంధ్రుల చిరకాల కోరిక ప్రత్యేక స్టేటస్

ఆచార్య కె.ఎస్.చలం

విశాఖ సిటీ : ఆంధ్రుల చిరకాల కోరికైన రాష్ట్రానికి ప్రత్యేక స్టేటస్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ సాధిస్తేనే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చినట్లు అవుతుందని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపకుడు, యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ జరగకుండా కొత్త ప్రభుత్వం ముందు ప్రతిపాదన పెట్టాలన్నారు.

టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు 2023 కోసం అడ్వెంచర్ ఇన్ ల్యాండ్, ఎయిర్, వాటర్ కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఏదైనా సాహస కృత్య కేటగిరీలో వ్యక్తులు అద్భుతమైన పనితీరు, అత్యుత్తమ నాయకత్వ లక్షణాలు, సాహస క్రమశిక్షణ భావం, నిర్దిష్ట సాహస రంగంలో నిరంతర విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ నెల 14 లోగా https://www.awards.gov. in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవార్డులను భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ అందిస్తుందన్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక పరీక్షలు

విశాఖ విద్య : స్వార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలోని టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం జిల్లాలోని 3 కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 261 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు 206 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ప్లెయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

అమాత్య పదవిపై ఆశలు!

- అంచనాల్లో కూటమి ఎమ్మెల్యేలు
- సీనియారిటీ, సామాజిక సమీకరణాల లెక్కలు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కూటమి తరఫున గెలిచిన ఎమ్మెల్యేల్లో అప్పుడే అమాత్య పదవిపై ఆశలు మొదలయ్యాయి. ఫలితాలు వచ్చి 24 గంటలైనా గడవకముందే ఎవరికి వారు తమకే మంత్రి పదవి దక్కుతుందంటూ అంచనాలేసుకుంటున్నారు. వారితో పాటు వారి ప్రధాన అనుచరులు కూడా ఊహల పల్లకీలో విహరిస్తున్నారు. సీనియారిటీ, సామాజిక సమీకరణలు, కూటమి పెద్దలతో ఉన్న పరపతి, పరిచయాలు, అనుబంధాలను ఇందుకు ఉదహరిస్తున్నారు. ఎవరికి అనుకూలంగా వారు లెక్కలేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 13 మంది ఎమ్మెల్యేలు కూటమి తరఫున ఎన్నికయ్యారు. వీరిలో నలుగురు జనసేన, ఒకరు బీజేపీ నుంచి, మిగిలిన ఎనిమిది మంది టీడీపీ నుంచి గెలుపొందారు.

- విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి నాలుగోసారి గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఈ దఫా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆయనకు బాలకృష్ణతో పాటు ఆయన అల్లుడు, విశాఖ ఎంపీగా ఎన్నికైన శ్రీభరత్‌తో సత్సంబంధాలున్నాయి. ఇవన్నీ తమ నాయకుడు వెలగపూడికి మంత్రి పదవి దక్కేందుకు కలిసొచ్చే అంశాలని ఆయన అనుచరులు చెబుతున్నారు.
- నాలుగోసారి గెలిచిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మంత్రిగా పనిచేశారు. తన సామాజిక వర్గం కోటా కలిసొస్తుందని ఆయన ఆశతో ఉన్నారు.
- పెందుర్తి నుంచి జనసేన తరఫున ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబుకి ఇది మూడోసారి గెలుపు. దీంతో తన సీనియారిటీ, జనసేన కోటా, సామాజికవర్గం కలిసొచ్చే అంశాలుగా చెప్పుకుంటున్నారు. అయితే గంటా, పంచకర్లది ఒకే సామాజికవర్గం కావడంతో ఈయనకు మంత్రి పదవి ప్రతిబంధకంగా మారుతుందని అంటున్నారు.
- నర్సీపట్నం నుంచి ఏడోసారి గెలుపొందిన అయ్యన్న తనకు మంత్రి పదవి ఖాయమన్న భావనలో ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కేబినెట్‌లో స్థానం దక్కడంతో ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- గాజువాక నుంచి టీడీపీ తరఫున రెండోసారి గెలిచిన పల్లా శ్రీనివాసరావు తన సామాజికవర్గ కోటాలో మంత్రివర్గంలో స్థానం ఉంటుందన్న నమ్మకంతో ఉన్నారు. ఆయన అనుచరులు ఇప్పటికే ఈ ప్రచారం మొదలు పెట్టారు.
- విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి రెండోసారి ఎన్నికైన విష్ణుకుమార్‌రాజు తనకు కూటమి బీజేపీ కోటాలో మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశతో ఉన్నారు. అయితే బీజేపీ నుంచి గెలిచిన సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్‌లు ఆయనకు పోటీగా ఉన్నారు.
- పాయకరావుపేట నుంచి రెండో దఫా ఎన్నికైన వంగలపూడి అనిత కూడా మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశిస్తున్నారు. ఎస్సీ సామాజికవర్గం, మహిళా కోటా తనకు కలిసొస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.
- జనసేన తరఫున అనకాపల్లి నుంచి గెలిచిన కొణతాల రామకృష్ణ 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారు. జనసేనలో సీనియర్ అయిన కొణతాల తనకు కేబినెట్‌లో బెర్త్ ఖాయమని భావిస్తున్నారు.
- ఆఖరి నిమిషంలో మాడుగుల సీటు దక్కించుకుని పోటీ చేసి గెలిచిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే అయ్యన్నది, ఈయనది ఒకే సామాజికవర్గం కావడం అడ్డంకిగా మారుతుందని చెబుతున్నారు. ఇలా ఫలితాలు వెలువడ్డాయో లేదో అలా మంత్రి పదవులపై ఎవరికి వారే అంచనాల్లో మునిగి తేలుతున్నారు. వారి అనుచరులు సైతం బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

ఎన్నికల విజయవంతంపై అభినందనలు

- జిల్లా అధికారుల పాత్ర అనిర్వచనీయం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



విశాఖ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది అనిర్వచనీయ పాత్ర పోషించారని, అప్పగించిన బాధ్యతల్ని అత్యంత అంకితభావంతో నిర్వర్తించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాల వెల్లడి వరకు అన్ని రకాల ప్రక్రియల్లో అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం అయ్యారని, అవిశ్రాంతంగా పనిచేశారని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఉదయం నుంచే అందరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించి నిర్ణీత సమయానికి ఫలితాలను వెల్లడించడంలో కీలకపాత్ర పోషించారని అభినందించారు. నివేదికల తయారీలో కింది స్థాయి సిబ్బంది కూడా ఉత్సాహంగా పనిచేశారని, అలాగే ఫలితాల వెల్లడి రోజున మీడియా సెంటర్ ద్వారా సంబంధిత అధికారులు, సిబ్బంది విస్తృత సేవలందించారన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ క్రతువుకు అన్ని విధాలుగా సహకరించిన రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, వెనకుండి నడిపించిన ఎన్నికల పరిశీలకులకు, ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందజేసిన జిల్లా రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఓటర్లు అత్యంత ఉత్సాహం ప్రదర్శించి తమ ఓటు హక్కును వినియోగించుకొని వారి బాధ్యతను నిర్వర్తించారని గుర్తు చేశారు.

ఉద్యోగిని బలి తీసుకున్న కెరటం


అభిలేష్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న లైఫ్‌గార్డ్

బీచ్‌రోడ్డు: సరదాగా కాసేపు సముద్రంలో సేద తీరేందుకు వచ్చిన ఉద్యోగిని కెరటం బలితీసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. కేరళ రాష్ట్రానికి చెందిన పి.వి.అభిలేష్(29) మర్చంట్ నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం తన స్నేహితులతో కలసి ఆర్.కె.బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేస్తున్న సమయంలో పెద్ద కెరటం అభిలేష్‌ను లోపలకు లాగేసింది. స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో లైఫ్‌గార్డ్స్ రంగంలోకి దిగి.. అతికష్టం మీద అభిలేష్‌ను ఒడ్డుకు తీసుకొచ్చారు. అప్పటికే ఆయన అపస్మారకస్థితికి చేరగా.. లైఫ్‌గార్డ్స్ ప్రథమ చికిత్స అందించారు. వెంటనే కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే అభిలేష్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పార్థసారథి తెలిపారు.

విద్యార్థులూ.. చూసొద్దాం రండి!

- వేసవిలో విజ్ఞానాన్ని పంచుతున్న 'ట్రిడెంట్'
- ఎన్‌ఏడీలో ఎన్‌ఎస్టీఎల్ ప్రదర్శన శాల


రాకెట్ నమూనా


యుద్ధ విమానం


ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన ట్రిడెంట్


జలంతార్గామి రాకెట్లు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్ ఎన్ఎస్టీఎల్ గేటుకు ఎదురుగా ఏర్పాటు చేసిన యుద్ధ పరికరాల ప్రదర్శనశాల విజ్ఞానాన్ని పంచుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు అనుసంధానంగా ఇక్కడి నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్టీఎల్) ప్రజోపకరమైన కార్యక్రమాల్లో భాగంగా 'ట్రిడెంట్'ను రూపొందించింది. డీఆర్‌డీవో, ఎన్ఎస్టీఎల్ ఆధ్వర్యంలో తయారు చేసిన అధునాతన యుద్ధ పరికరాల నమూనాలను ఇక్కడ ప్రదర్శన శాలలో ఏర్పాటు చేశారు. సైన్స్, సాంకేతిక రంగాల్లో ప్రయోగాలకు సిద్ధమవుతున్న భావి సైంటిస్టులు, విద్యార్థులు, అదే విధంగా ఉద్యోగులు, సాధారణ ప్రజలు సైతం దీనిని సందర్శించే అవకాశాన్ని కల్పించారు. యుద్ధ నౌక, యుద్ధ విమానం, వాయు, జలంతర్గామిలో ఉపయోగించే రాకెట్లు ఇలా వివిధ రకాల యుద్ధ పరికరాల నమూనాలు నేటి తరం వారికి విజ్ఞానాన్ని పంచుతున్నాయి. 'ట్రిడెంట్' పేరుతో ఏర్పాటు చేసిన దీనిని మరింత సుందరంగా, అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్టీఎల్ యాజమాన్యం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. చుట్టూ కంచె మాదిరే ఏర్పాటు చేసి, లోపలికి వెళ్లేందుకు గేటు పెట్టారు. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీ పెంచుతున్నారు. ఈ నమూనాలను అటుగా వచ్చే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

వానజల్లు!


మేఘావృతమైన ఆకాశం



సాక్షి, విశాఖపట్నం: విశాఖలో బుధవారం వర్షం కురిసింది. ఉదయమంతా ఆకాశం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నం నుంచి కారు మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో తొలుత చిరుజల్లులు మొదలయ్యాయి. ఆపై కొంతసేపు మోస్తరు వర్షం కురిసింది. ఇలా సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కొనసాగింది. వానతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీచాయి. పెదగంట్యాడ, గాజువాకల్లో 3 సెం.మీలు, పెందుర్తిలో 2.7, సింహాచలం 2.1, మహారాణిపేట 1.1, భీమిలిలో 1 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. గురు, శుక్రవారాల్లోనూ విశాఖలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



వర్షంలోనే రాకపోకలు


సిరిపురం వద్ద కూలిన చెట్టు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్


పర్యావరణ ప్రదర్శనలో విద్యార్థులతో కలిసి ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ


మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ విద్య : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. పెందుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి 'పర్యావరణ పరిరక్షణ–మనందరి బాధ్య' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖన పోటీల్లో విజేతలుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ వేడుకల్లో సుమారుగా 2 వందల మంది విద్యార్థులను భాగస్వామ్యులను చేయటం పట్ల అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆయన సీతమ్మధార మండల భవిత కేంద్రాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో కె.సువర్ణ, సెక్టోరియల్ అధికారులు అప్పలనాయుడు, జిల్లా సైన్సు అధికారి కప్పలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

ఏయూక్యాంపస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవా ప్రాధికార సంస్థ, విశాఖ న్యాయవాదుల సంఘం, జిల్లా పర్యావరణ పరిరక్షణ సమితి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల న్యాయమూర్తులతో కలిసి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేంద్ర మీడియేషన్ కన్సిలేషన్ సభ్యురాలు న్యూఢిల్లీ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి నిషా సక్సేనా, కేంద్ర న్యూఢిల్లీ జ్యుడిషియల్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ అదితి అగర్వాల్, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవర సత్యనారాయణ, జిల్లా పర్యావరణ పరిరక్షణ మండలి చీఫ్ ఇంజనీర్ నాగిరెడ్డి, న్యాయమూర్తి ఎ.రాధాకృష్ణ, మెట్రోపాలిటీ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర న్యాయమూర్తులు, పర్యావరణ పరిరక్షణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

సహజ వనరులను సంరక్షించుకుందాం

డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


రైళ్ల ప్రయాణికులకు నార సంచులు పంపిణీ చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


రైల్వే కాలనీలో మొక్కలు నాటుతున్న డీఆర్ఎం, ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను రక్షించుకుందామని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో బుధవారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్‌ను అందించగలమన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్ అవగాహన ర్యాలీ, అనంతరం పలు రైళ్లలో ప్రయాణికులకు నార సంచులను పంపిణీ చేశారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, తన బృందంతో కలిసి రైల్వే కాలనీ, పార్క్‌ల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ సుంకరి రామకృష్ణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఆర్‌జీయూకేటీ ప్రొఫెసర్‌లు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు, కాలుష్య నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు.

మొక్కలు నాటి, బాధ్యత తీసుకోండి


మొక్క నాటిన అనంతరం పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు, అధికారులు


సముద్రతీర ప్రాంతంలో చెత్తను సేకరిస్తున్న నేవీ సిబ్బంది

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పర్యావరణ సంరక్షణలో వ్యక్తిగత బాధ్యత, ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పరిసరాల్లో ఓ మొక్కను నాటడంతో పాటు దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడంలో పోర్టు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. నగర పరిధిలో స్థానిక సంస్థలను మమేకం చేస్తూ మూడు నెలల్లో 10 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. ఇందుకోసం పోర్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు, వ్యాపార భాగస్వాములకు, స్థానిక సంస్థలకు అవసరం మేరకు మొక్కలు అందిస్తుందని చెప్పారు. వారం రోజులుగా జరుగుతున్న పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

తూర్పు నావికాదళంలో..

సింధియా: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తూర్పు నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో బుధవారం బీచ్ క్లీనప్, స్పెషల్ ప్లాంటేషన్ డ్రైవ్‌లను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో డీఎస్సీ, డిఫెన్స్ సివిలియన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీచ్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను సేకరించారు. అన్ని నావికా స్టేషన్లలో మొక్కలు నాటారు. అటవీ శాఖ సహకారంతో మడ మొక్కల పెంపకం, తీరప్రాంత రక్షణ తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

గిరి విద్యార్థుల సత్తా

మధురవాడ: నీట్ ఫలితాల్లో మారికవలసలోని గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ శిక్షణ సంస్థకు చెందిన 28 మంది పరీక్షకు హాజరు కాగా.. 12 మంది అర్హత సాధించారు. వీరిలో ఇద్దరు సీట్లు పొందే అవకాశం ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన జి.గోపాలరావు 482 మార్కులతో ఆలిండియా స్థాయిలో 3,686 ర్యాంకు సాధించాడు. ఎస్టీ కేటగిరీలో ప్రముఖ ప్రభుత్వ కళాశాలలో ఆయనకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చే అవకాశం ఉంది. అలాగే చింతపల్లి మండలం పాత కిన్నెర గ్రామానికి చెందిన పి.మత్స్యరాజు 384 మార్కులతో ఎస్టీ కేటగిరీలో ఆలిండియా స్థాయిలో 10,859 ర్యాంకు పొందాడు. ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం ఉంది. విజేతలను సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్, ఇతర అధ్యాపకులు అభినందించారు.


కుటుంబ సభ్యులతో గోపాలరావు

నాన్న ఉండుంటే ఎంతో సంతోషించేవారు



మాది హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామం. అమ్మ లక్ష్మి వ్యవసాయ కూలీ. నాన్న ప్రసాదరావు రెక్కల కష్టంతో నన్ను చదివించారు. నేను డాక్టర్ కావాలన్నది ఆయన కల. ఆయన ఆకాంక్షను నేరవేర్చేందుకు కష్టపడి చదివాను. 482 మార్కులతో ఆలిండియా స్థాయిలో 3,686 ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. అయితే ఈ సమయంలో నాన్న మా మధ్య లేకపోవడం చాలా బాధగా ఉంది. ఆయన ఉండుంటే ఎంతో సంతోషించేవారు.

– జి.గోపాలరావు, మారికవలస గిరిజన గురుకుల శిక్షణ సంస్థ

ఆనందంగా ఉంది



మాది అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, పాత కిన్నెర గ్రామం. తల్లిదండ్రులు నీలమ్మ, బంగార్రాజు వ్యవసాయ కూలీలు. మాకు ఆర్థిక పరిస్థితి బాగులేక పోయినా.. గిరిజన గురుకుల సంస్థ మంచి అవకాశం కల్పించింది. 384 మార్కులతో జాతీయ స్థాయిలో 10,859వ ర్యాంకు సాధించాను. ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్‌లో సీటు వచ్చే అవకాశం ఉంది. చాలా ఆనందంగా ఉంది.

–మత్స్యరాజు, మారికవలస గిరిజన గురుకుల శిక్షణ సంస్థ

నారాయణ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డీజీఎం హనుమంతరావు

సీతమ్మధార: నీట్-2024 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మరోసారి ప్రభంజనం సృష్టించాయని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ హనుమంతరావు తెలిపారు. ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ విశాఖ విద్యార్థులు దేశిన సూర్య చరణ్ 340 ర్యాంకు, కిరణ్ రాజాన 360, గురుగుబెల్లి జాయి కిశోర్ 442, దోకుల శరణ్య 704, బొల్లు పార్థు 872, అల్లు కావ్యాంజలి 988 ర్యాంకులు సాధించారన్నారు. సంస్థ అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. ఆయనతో పాటు సంస్థ డీన్ జి.రామలింగేశ్వరరావు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

కార్డియాలజిస్ట్ అవుతా..



నీట్ ఫలితాల్లో 710 ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. నారాయణ సంస్థ అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించాను. భోపాల్‌లోని ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదివి, తర్వాత పీజీ చేసి కార్డియాలజిస్ట్ అవుతా. మాది సామాన్య రైతు కుటుంబం.

–దేశిన సూర్య చరణ్, విశాఖపట్నం

శ్రీవిశ్వ విజయకేతనం


కె.అభిషేక్ సూర్య


ఎం.శ్రావణి

సీతంపేట: నీట్ 2024 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కె.అభిషేక్ సూర్య 695 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 1,686 ర్యాంకు, ఎం.శ్రావణి 690 మార్కులతో జాతీయ స్థాయిలో 1,628 ర్యాంకు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. అలాగే తమ విద్యార్థులు 2,417, 2,710, 3,154, 3,304, 3,825, 4,321, 4,637, 4,721, 6,063, 6,094, 6,333, 6,594, 6,718, 6,834, 7,132, 8,573, 8,746, 9,691 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. రెండు వేల లోపు రెండు, 5 వేల లోపు 10, 10 వేల లోపు 20 ర్యాంకులు సాధించగా.. మొత్తంగా 120 మందికి పైగా మెడికల్ సీట్లు పొందే ర్యాంకులతో అర్హత సాధించారన్నారు. 31 మంది 600లకు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు.

మెరిసిన చైతన్య విద్యార్థులు


పావని


జయదీప్


మారుతి


ఆకాష్ వర్మ


రేష్మిత

విశాఖ విద్య: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ఫలితాల్లో చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. తమ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఏజీఎం కె.వి.రమణ వెల్లడించారు. గాజువాకకు చెందిన ఎస్.పావని జాతీయ స్థాయిలో 322 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ద్వారకానగర్‌కు చెందిన బి. జయదీప్ 570వ ర్యాంకు, అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన జె.మారుతి 623, మురళీనగర్‌కు చెందిన ఎస్.ఆకాష్ వర్మ 642, టి.రేష్మిత 1,099 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించి.. ఇంతటి విజయానికి అధ్యాపకుల కృషి, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం కారణమన్నారు.

శశి విద్యార్థుల ప్రతిభ


ఫణికుమార్


శ్రీవల్లి

తగరపువలస: నీట్-2024 ఫలితాల్లో సంగివలస శశి విద్యార్థులు సత్తా చాటారు. ఎం.డి.ఎస్.ఫణికుమార్ ఆల్ ఇండియాలో 181, బి.శ్రీవల్లి 186, పి.అంజలిజాయ్ 1,523, కె.షణ్ముఖ శ్రీసాయి 3,270వ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. 600కు పైగా మార్కులు 22 మంది, 550కు పైగా మార్కులు 40 మంది, 500కు పైగా మార్కులు 50 మంది విద్యార్థులు సాధించారు. వీరిని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కార్యదర్శి మేకా క్రాంతిసుధ అభినందించారు.


షణ్ముఖశ్రీసాయి

నీట్‌లో రాణించిన రైతుబిడ్డ


కిరణ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు


యలమంచిలి రూరల్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్-2024 ఫలితాల్లో సాధారణ రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి రాజాన కిరణ్ మంచి ప్రతిభ కనబరిచాడు. యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన కిరణ్ నీట్(యూజీ) ఫలితాల్లో 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించి, ఓబీసీలో 368 ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో 1142 ర్యాంక్ పొందాడు. 10వ తరగతిలో 476/500 మార్కులు(సీబీఎస్‌ఈ),12వ తరగతిలో 458/500 (సీబీఎస్‌ఈ) మార్కులు సాధించాడు. ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరి మంచి కార్డియాలజిస్టు కావడమే తన లక్ష్యంగా కిరణ్ 'సాక్షి'కి తెలిపాడు.విద్యార్థి తండ్రి రాజాన సత్యనారాయణ సాధారణ రైతు. కిరణ్ నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇంటర్మీడియెట్ చదివించేందుకు తన కుమారుడికి విశాఖ డెయిరీ చైర్మన్,వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ సంవత్సరానికి రూ.50 వేల చొప్పున రెండేళ్లు రూ.లక్ష సాయం చేశారని సత్యనారాయణ చెప్పారు. ఆడారి ఆనంద్‌కుమార్ సహాయాన్ని మరిచిపోలేనని, ఎల్లప్పుడూ అతనికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. విశాఖ నారాయణ కళాశాలలో చదివిన కిరణ్‌ను బుధవారం కళాశాల డీజీఎం హనుమంతరావు, ఏజీఎం నాగేశ్వరరావు,ఇన్‌చార్జ్ సింహాద్రి,అధ్యాపకుడు పురుషోత్తపురం గ్రామస్తులు అభినందించారు.

హేమంత్‌కు 557 ర్యాంకు

నాతవరం: మారుమూల గిరిజన గ్రామానికి చెందిన సోలం హేమంత్ నీట్ ఫలితాల్లో 557 ర్యాంకు సాధించాడు. మండలంలో వెదురువల్లి పంచాయతీ శివారు కోడవటిపూడి గ్రామానికి చెందిన హేమంత్ పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీలో చదివాడు.హేమంత్ తండ్రి సోలం కొండబాబు మండలంలో సరుగుడుపంచాయతీ శివారు రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. హేమంత్‌కు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంతఃవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు అభినందనలు తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు


అరెస్టయిన నిందితులతో పోలీసులు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, వస్తువులు

రాయగడ: రాయగడ నుంచి సరిహద్దు ప్రాంతమైన కెరడ వరకు ఇటీవల జరిగిన పలు దోపిడీ కేసులకు సంబంధించి శెశిఖాల్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన మీనాక సూర్యకుమార్ (37), విశాఖపట్నం జిల్లా ఆరిలోవకు చెందిన పి.చంద్రశేఖర్ (40), సదర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంబిగుడ ప్రాంతానికి చెందిన సిద్దు మెలక (23) ఉన్నారు. వీరి వద్ద నుంచి 123 గ్రాముల ఆరు బంగారు ముక్కలు, 41.999 గ్రాముల బంగారు గొలుసు, 34.540 గ్రాముల బంగారు మంగళ సూత్రం, 13.110 గ్రాముల బంగారు చైన్, నాలుగు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి ఎస్పీ హరీష్ బుధవారం రాయగడ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితులు నిర్మానుష్యమైన ప్రాంతాల్లో కాపు కాసి ద్విచక్రవాహనాలను అడ్డగించి మారణాయుధాలతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతుండేవారని వివరించారు. ఈ క్రమంలో శెశిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది మే 5 వరకు ఏడు కేసులు నమోదు కాగా పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. వీరందరినీ కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో శెశిఖాల్ ఐఐసీ మున్ని ఆచార్య తదితరులు పాల్గొన్నారు.